

'బాలోత్సవాలను జయప్రదం చేయాలి'

భీమవరం : భీమవరంలో నిర్వహించబోయే బాలోత్సవాలను జయప్రదం చేయాలని రిటైర్డ్ డిఇఒ ఇందుకూరి ప్రసాద్ రాజు అన్నారు. భీమవరం మారుతీ నగర్‌లోని మారుతీ నగర్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పెద్దలు, పిల్లల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిటైర్డ్ డిఇఒ ప్రసాదరాజు మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ బాలోత్సవాలు దోహదపడతాయన్నారు. పిల్లల్లో ఎంతో నైపుణ్యం దాగి ఉందని, వాటిని ప్రదర్శించే వేదికలు కరువైపోయాయని విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఆదివారం స్థానిక మారుతీ నగర్ పార్క్‌లో పిల్లల సందడితో బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా బాలోత్సవం పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు వలవల నరసింహారావు, పి.రామ్మోహన్‌రావు, పంపన శ్రీనివాస్ రావు, సూర్యనారాయణ రాజు, కె.శ్రీరామచంద్రమూర్తి, సిహెచ్.రామకృష్ణ రాజు(ఎస్ఎల్‌వి మైత్రి టవర్స్) పాల్గొన్నారు.

పునరావాసంపై.. ప్రణాళిక లేదాయే..!

పోలవరం ప్రాజెక్టు పనులపై అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

డయాఫ్రంవాల్, గ్యాప్-1,2, ఇతర ప్రాజెక్టు పనులపై తేదీలతో సహా ప్రణాళిక

2026 అక్టోబర్‌కు ప్రాజెక్టు పూర్తిచేస్తామని ప్రకటన

నిర్వాసితుల పునరావాసంపై మాత్రం ప్రణాళిక నిల్

మీడియాపై సవాలక్ష ఆంక్షలు



పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు, ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, పోలవరం

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన పనుల పూర్తిపై తేదీలతో సహా ప్రణాళిక ప్రకటించిన సిఎం చంద్రబాబు, ప్రాజెక్టులో అత్యంత కీలకమైన నిర్వాసితుల పునరావాస పరిహారంపై ఎటువంటి ప్రణాళిక ప్రకటించకుండా, ముక్తసరిగా మాట్లాడి తన పర్యటన ముగించిన పరిస్థితి నెలకొంది. సిఎం పర్యటనతో తమకు భరోసా దొరుకుతుందని ఆశించిన నిర్వాసిత కుటుంబాలకు మరోసారి నిరాశ మిగిలింది. ప్రాజెక్టు పనులపై సిఎం ప్రకటించిన ప్రణాళికను పరిశీలిస్తే అందులో నిర్వాసితులకు సంబంధించి ఒక్క అంశం కూడా లేదు. సోమవారం సిఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించారు. ఉదయం 10.45 గంటలకు రావాల్సిన సిఎం దాదాపు గంట ఆలస్యంగా 11.50 గంటలకు చేరుకున్నారు. హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే తర్వాత, కొండపైన ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద దిగారు. సిఎంకు మంత్రులు, ఎంఎల్ఎలు, జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. ముందుగా కొండపైన ఉన్న వ్యూపాయింట్ నుంచి ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం రోడ్డు మార్గం గుండా ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్నారు. డయాఫ్రంవాల్, గ్యాప్ - 1, 2 పనులతో పాటు ఇతర పనులను సిఎం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన మ్యాప్ పాయింట్ల ద్వారా సిఎంకు పనుల ప్రగతి గురించి ఇరిగేషన్ అధికారులు వివరించారు. దాదాపు గంటన్నరపాటు ప్రాజెక్టు పనులను సిఎం పరిశీలన చేశారు. అక్కడ నుంచి కొండపైన ఉన్న సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, కాంట్రాక్టర్లు, అధికారులతో సమావేశమైన సుదీర్ఘంగా చర్చించి పనులు ప్రగతిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో సిఎం మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో 2026 అక్టోబర్ నాటికి పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళు న్నట్లు తెలిపారు. డయాఫ్రమ్ వాల్, ఇసిఆర్ఎఫ్ డ్యాం నిర్మాణ పనులను సమాంతరంగా చేపట్టొచ్చని నిపుణులు సూచించారన్నారు. కొత్త డయాఫ్రమ్ వాల్ పనులను జనవరి రెండో తేదీన చేపట్టనున్నట్లు తెలిపారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు 2026, మార్చి నెలకు నాటికి పూర్తిచేస్తామని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారని, 2025, డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. ఇసిఆర్ఎఫ్, గ్యాప్ - 1 పనులు 2026 ఫిబ్రవరి నాటికి, గ్యాప్- 2 పనులు 2027 డిసెంబర్‌లోగా పూర్తి చేస్తామన్నారు. ఇంకా ముందుగానే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కోరుతూ లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ప్రాజెక్ట్ సివిల్ పనులను 2026 మే, జూన్ నాటికి పూర్తి చేస్తే ఒక సీజన్‌ను కోల్పోకుండా ఉంటామని, 2026 నుండి ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ ఉండేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను కోరామన్నారు. ప్రాజెక్ట్ కుడికాల్వ, ఎడమ కాల్వ కనెక్టివిటీ పనులు 2026, జూన్ లోగా, స్పిల్ ఛానల్ పనులు 2026, జూన్ నాటికి పూర్తి చేయాలన్నారు. మొదటి దశలో 41.15 లెవెల్ నిర్మాణానికి రూ.12,157 కోట్లు సాధించామన్నారు. వాటిలో రూ.2,345 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చేసిందన్నారు.

పునరావాసంపై చర్చ లేదు.. ప్రణాళిక లేదాయే..

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 96.600 కుటుంబాలను తరలించినట్లు ప్రభుత్వం తేల్చింది. ఇప్పటి వరకు 12,797 కుటుంబాలను మాత్రమే తరలించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 41.15 మొదటి దశకు సంబంధించి వెంటనే తరలించాల్సిన కుటుంబాలు రెండు జిల్లాల్లో ఇంకా 25,263 ఉన్నాయి. ఇప్పటి వరకూ 13.01 శాతం మాత్రమే పునరావాసం కల్పించిన పరిస్థితి ఉంది. మొదటి దశకు ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం రూ.12,157 కోట్లు ఇచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది. సోమవారం సిఎం చెబుతున్న మాటల ప్రకారం ఈ సొమ్ములతోనే తొలిదశ పునరావాసం, ప్రాజెక్టు పనులు చేయాల్సి ఉంది. అలాంటప్పుడు ప్రాజెక్టు పనులపై తేదీల వారీగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపిన సిఎం పునరవాసం ఏవిధంగా అమలు చేస్తారో ఒక్కమాట కూడా చెప్పలేదు. 2026కు పునరావాసం పూర్తి చేస్తామంటూ ముక్తసరిగా ఒక్కమాట చెప్పి వదిలేసిన పరిస్థితి నెలకొంది. సిఎం పర్యటనతో తమకు భరోసా దొరుకుతుందని ఆశించిన నిర్వాసితులకు మరోసారి నిరాశే మిగిలింది. ముఖ్యమంత్రి పర్యటనలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, శాసనసభ్యులు చిర్రి బాలరాజు, డాక్టర్ కామినేని శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజు, కొలికపూడి శ్రీనివాసరావు, పితాని సత్యనారాయణ, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), బత్తుల బలరామకృష్ణ, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో సిఎం పర్యటనలకు సవాలక్ష ఆంక్షలు పెట్టి జర్నలిస్టులను తీవ్ర ఇబ్బందులు పెట్టిన పరిస్థితి కొనసాగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సైతం అదే ఒరవడి కొనసాగుతున్న పరిస్థితి.



పనులపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

3, 4, 5 తేదీల్లో సిపిఎం జిల్లా మహాసభలు

హాజరుకానున్న సిపిఎం జాతీయ, రాష్ట్ర నేతలు

3న అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి సందర్భంగా భారీ ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

జనవరి 3, 4, 5వ తేదీల్లో సిపిఎం జిల్లా మహాసభలు భీమవరంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో మహాసభ లోగోను జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ సిపిఎం మూడేళ్లకోసారి గ్రామస్థాయి నుంచి అఖిల భారత స్థాయి వరకూ మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈ కాలంలో ప్రజా సమస్యలపై చేసిన కృషిని సమీక్షించుకుని భవిష్యత్‌లో ప్రజా పోరాటాలకు సిద్ధమయ్యేలా ఈ మహాసభలు జరుగుతాయన్నారు. దీనిలో భాగంగా 2025 ఫిబ్రవరి 2, 3, 4వ తేదీల్లో రాష్ట్ర మహాసభలు నెల్లూరులో, ఏప్రిల్ మొదటి వారంలో అఖిల భారత మహాసభలు తమిళనాడు రాష్ట్రంలో మధురైలో జరుగుతాయన్నారు. ఇప్పటికే జిల్లాలో గ్రామ, మండల మహాసభలు పూర్తయ్యాయన్నారు. జిల్లా మహాసభలను పురస్కరించుకొని అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి సంవత్సరం ముగింపు సందర్భంగా భీమవరంలో 3న తేదీన భారీ ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. 4, 5వ తేదీల్లో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. జిల్లా నలుమూలల నుంచి సిపిఎం నాయకులు ప్రతినిధులుగా హాజరవుతారని తెలిపారు.

అల్లూరి స్ఫూర్తితో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు, సిపిఎం భవిష్యత్ పోరాటాలకు ఈ మహాసభలు నాంది పలుకుతాయన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజా సమస్యలపై సిపిఎం విశేష కృషి చేసిందన్నారు. ప్రధానంగా జిల్లాలో కాలుష్యాన్ని అరికట్టేలా అనేక పోరాటాలు చేసిందని చెప్పారు. రైతు ధాన్యం బకాయిలు, రైతు, కౌలు రైతు సమస్యలపై ఉద్యమించామన్నారు. జిల్లాలో భారీగా ఉన్న ఆక్వా నుంచి ఆదాయం పొందే ప్రభుత్వాలు ఆక్వా రైతుల సమస్యలను గాలికొదిలేశారని, తక్షణం వారి సమస్యలను పరిష్కరించాలని, విద్యుత్ రాయితీలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఐదు పట్టణాల్లో నేటికీ టిడ్కో గృహాలను స్వాధీనం చేయలేదని విమర్శించారు. దీనివల్ల లబ్ధిదారులు అప్పులపాలై, వడ్డీలు కట్టే పరిస్థితి ఉందన్నారు. అంతేగాక సొంతిల్లులేక అద్దె ఇళ్లల్లో ఉండే పరిస్థితి దాపురించిందన్నారు. టిడ్కో గృహాల కోసం వేల మందితో ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించామని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు అండగా నిలిచిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కేటాయింపులు తగ్గించడం సరికాదన్నారు. ప్రజలపై భారాలు వేసేలా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు మరింత పెంచడం అన్యాయమన్నారు. నిత్యావసర, మందుల ధరలు పెరగడం వల్ల సామాన్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాటిపై సిపిఎం అనేక ఉద్యమాలు చేసిందన్నారు. జిల్లాలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల సమస్యలపై దఫదఫాలుగా దీక్షలు, ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు చేసిన ఘనత సిపిఎంకు ఉందన్నారు. నూతన మద్యం పాలసీ పేరుతో నివాస ప్రాంతాల మధ్య, బడి, గుడి వంటి ప్రాంతాల్లో మద్యం షాపులు నిర్వహించడాన్ని మహిళా సంఘాలతో కలిసి ఆందోళనలు చేశామన్నారు. దళితపేటల్లో స్కూళ్లను విలీనం పేరుతో ఎత్తివేయడాన్ని నిరసిస్తూ, యువతకు డిఎస్‌సి, ఉపాధి కల్పనకై, ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై జిల్లా వ్యాప్తంగా పోరాటాలు చేశామని చెప్పారు. నరసాపురంలో కాలుష్యానికి వ్యతిరేకంగా వందల మందితో మున్సిపల్ కార్యాలయ ముట్టడి, తాడేపల్లిగూడెంలో చెత్త సమస్యపై, ఆకివీడులో ప్రజలను భయభ్రాంతులను గురిచేసేలా రౌడీ ఇజంపై పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించామన్నారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీల అదనపు భారాలకు, స్మార్ట్ మీటర్లు అదానీ కంపెనీతో ఒప్పందం, అవినీతిపై వ్యతిరేకంగా పోరాడుతున్నామన్నారు.

జిల్లాలో దళితులకు శ్మశానవాటికలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో డంపింగ్ యార్డు, ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ఉండిలో ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. ఉండి రోడ్డులో, శృంగవృక్షంలో, కుముదవల్లిలోని రైల్వే గేట్ల వద్ద అండర్ బ్రిడ్జిలు కడతామని కనీసం పట్టించుకోవట్లేదని వాటిపై కేంద్రీకరించి సిపిఎం ఆందోళనలు చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, చేతివృత్తిదారులు, దళితులు, పేద ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమించేలా ఈ మహాసభల్లో కార్యాచరణ రూపొందిస్తామని బలరాం తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని పట్టణంలోని పెద్దలు, దాతలు, ప్రజలును ఆయన కోరారు.



లోగోను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం, నేతలు

'మూర్తిరాజు దాతృత్వం అనుసరణీయం'

ప్రజాశక్తి - భీమవరం

వంద సంవత్సరాల క్రితం చదువే అభివృద్ధికి మూలం అని గ్రహించి, ఆడపిల్లల విద్యకు ప్రోత్సాహం అందించిన మూర్తిరాజు దాతృత్వం అనుసరణీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం విద్యాదాత, గాంధీయవాది చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద్(మూర్తి రాజు) 106వ జయంతి సందర్భంగా జువ్వలపాలెం రోడ్డు అడ్డ వంతెన దగ్గర ఆయన విగ్రహం వద్ద విశ్వశాంతి వృద్ధుల సంక్షేమ సంఘం ఆశ్రమం, అల్లూరి సీతారామరాజు సేవా సమితి, జిల్లా సర్వోదయ మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూర్తి రాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 110 సంవత్సరాల క్రితమే విద్య ఎంత అవసరమో, మరీ ముఖ్యంగా ఆడపిల్లలకు ఎంత అవసరమో గుర్తించి, వందలాది విద్యాసంస్థలను నెలకొల్పిన మహనీయుడు, విద్యాదాత, గాంధీయవాది మూర్తిరాజు మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. వినోదబావే భూదానోద్యమ పిలుపుకు తృణప్రాయంగా వందలాది ఎకరాల భూమిని అందజేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఇటువంటి దాతృత్వం కలిగిన స్ఫూర్తిదాయకమైన వ్యక్తుల వల్లనే నేడు ప్రతి ఒక్కరికీ విద్య చేరువైందన్నారు. వృద్ధాశ్రమలకు కుష్టు వ్యాధి కాలనీలకు స్థలాలు అందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వీరు 68 ఉన్నత పాఠశాలలు, 10 జూనియర్, డిగ్రీ కళాశాలు, రెండు పిఇటి కళాశాలు, 5 ఓరియంటల్ పాఠశాలలను నెలకొల్పిన విద్యా ప్రదాత గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నారు. ఎంతోమంది ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి తద్వారా ఉపాధిని కల్పించారన్నారు. సుమారు 30 సంవత్సరాలు శాసనసభ్యులుగాను, దేవాదాయ ధర్మాదాయ శాఖ, విద్యా శాఖలకు మంత్రివర్యులుగా వారి సేవలు అనన్యమన్నారు. వారు నిర్మించిన విద్యాసంస్థలలో ఒక్కదానికైనా వారి పేరును పెట్టుకోలేదని, జాతీయ నాయకుల పేర్లున ఆ విద్యాసంస్థలకు నామకరణం చేయడం ఎంతో నిరాడంబరత, స్ఫూర్తినిస్తుందన్నారు. మానవతా మూర్తిగా, గాంధీయవాదిగా, ధర్మ మార్గాన నడిచిన వ్యక్తులను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ వారి మార్గంలో కొంతైనా అనుసరించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి మాట్లాడుతూ మూర్తిరాజు గాంధేయం నవ భారత నిర్మాణానికి సోపానమని, ఆయన విద్యాలయాల్లో చదివిన విద్యార్థులు ఎందరో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారని అన్నారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు భూపతిరాజు సత్యనారాయణరాజు, అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, మాజీ కార్యదర్శి కలిదిండి గోపాలకృష్ణంరాజు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు, ఎఎస్.రాజు మాట్లాడుతూ మూర్తిరాజు విద్యా సేవలు అద్వితీయమని, ఆయన మార్గాన్ని అనుసరించాలని, దాతృత్వానికి మారుపేరు మూర్తిరాజు అని, ఆయన స్థాపించిన విద్యాలయాల్లో భీమవరంలో కూడా రెండు కళాశాలలు, మూడు హైస్కూల్లు ఉన్నాయని, వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి, ఆనంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, ఎఎస్ఆర్ సేవాసమితి అధ్యక్షులు గాదిరాజు సుబ్బరాజు, రిటైర్డ్ హైస్కూల్ హెడ్మాస్టర్ వివి రాధాకృష్ణమూర్తి, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, లయన్ ఇంటర్నేషనల్ సిహెచ్.కృష్ణంరాజు, కంతేటి వెంకటరాజు, కలిదిండి గోపాలకృష్ణ, భూపతిరాజు సత్యనారాయణ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంధనాన్ని పొదుపు చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఇంధనాన్ని పొదుపు చేసి భావితరాలకు వెలుగు నిద్దామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రకాశం చౌక్ నుంచి పిపి రోడ్డు మీదుగా విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం వరకూ విద్యుత్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. తొలుత ప్రకాశం చౌక్ వద్ద ఏర్పాటు చేసిన మానవహారంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఇంధన పొదుపుపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపుగా వాడడం ద్వారా భవిష్యత్తులో దేశానికి విద్యుత్ సమస్య లేకుండా చేయొచ్చని తెలిపారు. రోజు రోజుకూ దేశంలో విద్యుత్ వినియోగం పెరిగిపోతోందని, దీన్ని తగ్గించే ఉద్దేశంతో సాంప్రదాయేతర ఇంధన వినియోగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాల కోసం ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపైనా ఉందని స్పష్టం చేశారు. ఒక యూనిట్ విద్యుత్ ఆదా చేయడం వల్ల రెండు యూనిట్లు ఉత్పత్తి భారం తగ్గుతుందన్నారు. వ్యవసాయ, గృహ అవసరాలకు సంబంధించి సోలార్ విధానాన్ని వినియోగంలోకి తెచ్చే విధంగా ప్రమోట్ చేస్తున్నామని, తద్వారా విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ ఆలపాటి రఘునాథ్ బాబు, ఇఇలు టెక్నికల్ అండ్ కన్స్ట్రక్షన్స్ ఎం.రఘూన్సీ, భీమవరం ఎన్.వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెం కె.నరసింహమూర్తి, నరసాపురం కె.మధుమూర్తి, పలువురు డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

మానవీయ దృక్పథంతో అర్జీలు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మానవీయ దృక్పథంతో అర్జీల పరిష్కారం చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజా ప్రతినిధుల ద్వారా అందిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతోపాటు, సమస్యను ఓర్పుతో వినాలన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జెసి కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 152 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని నిర్ణీత సమయం లోపు పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని, అప్పుడే ప్రజలకు మనపై నమ్మకం కలుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారమూ సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ వెంకటేశ్వర్లు, కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణ రెడ్డి, డిఎల్‌డిఒ వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

కుక్కిలేరు మురుగు కాలువను ఆధునికీకరించాలి

జెసికి కౌలు రైతుల సంఘం వినతి

ప్రజాశక్తి - భీమవరం

నరసాపురం మండలం వేములదీవి వెస్ట్ పంచాయతీ పరిధిలోని గొందిమూల నుంచి వేములదీవి ఈస్ట్ పంచాయతీ బియ్యపుతిప్ప వరకూ ఉన్న ఈస్ట్ కుక్కిలేరు మురుగు కాలువను తక్షణం ఆధునికీకరించాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డికి మురుగు కాలువను ఆధునికీకరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఈ మురుగు కాలువను అనేక ఏళ్ల నుంచి తవ్వకపోవడంతో పూడుకుపోయి, గట్లు తెగిపోయి రైతులకు ఉపయోగపడకుండా నిరుపయోగంగా ఉందన్నారు. ఈ కాలువపై మూడు కిలోమీటర్ల పరిధిలో 3,500 ఎకరాలు పైబడి సాగవుతోందన్నారు. ఈ భూములు నరసాపురం ప్రధాన పంట కాలువకు చివరన ఉండడంతో సాగునీరు అందకపోవడంతో అటు గోదావరి ప్రాంతాన్ని ఆనుకుని ఉండడంతో ఆక్వా చెరువులుగా మార్చి సాగు చేస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఈ మురుగు కాలువ ఏళ్ల తరబడి పూడుకుపోవడంతో వేలాది ఎకరాల సాగు భూమి నిరుపయోగంగా మారి రైతాంగానికి ఎలాంటి ఉపయోగం లేకుండా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై స్పందించిన జాయింట్ కలెక్టర్ డ్రెయినేజీ శాఖ జిల్లా అధికారి (ఇఇ) సిహెచ్ వివిఎస్.సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ సమస్యను పరిశీలించి ఆధునికీకరణ పనుల్లో పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి కాలువను తవ్వుతామని తెలిపారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు ఉన్నారు.

సాప్-1 పరీక్ష పేపర్లు ఉన్నత పాఠశాలకు నేరుగా ఇవ్వాలి

యుటిఎఫ్

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 17, 18, 19, 20 తేదీల్లో ఉన్నత పాఠశాలలో జరగబోయే సాప్-1 పరీక్షలకు పేపర్లను ఉదయం, సాయంత్రం ప్రధానోపాధ్యాయులు పోలీస్‌స్టేషన్‌కు గంట ముందు వెళ్లి తీసుకుని పరీక్ష నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడాన్ని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు ఎకెవి.రామభద్రం ఖండించారు. పరీక్ష పేపర్లో లీకైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్ స్టేషన్‌కు 15 నుంచి 20 కిలో మీటర్ల దూరంలో ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, అంతదూరం నుంచి పేపర్లు తీసుకెళ్లినప్పుడు భద్రతకు ఇబ్బంది కలుగుతుంది కాబట్టి విద్యాశాఖ అధికారులే నేరుగా పాఠశాలకు పరీక్ష పేపర్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా విజయరామరాజు, రామభద్రం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన యుటిఎఫ్ జిల్లా మహాసభలో యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులుగా పిఎస్.విజయరామరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎకెవి.రామభద్రం తిరిగి ఎన్నికయ్యారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా సిహెచ్.పట్టాభి రామయ్య, సహాధ్యక్షుడుగా కె.రాజశేఖర్, మహిళా సహాధ్యక్షురాలిగా సిహెచ్.నాగ శిరోమణి, కోశాధికారిగా పోలిశెట్టి క్రాంతి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శులుగా సర్వశ్రీ, పి.శివప్రసాద్, ఎస్.రత్నరాజు, టిజె.విజయ్ కుమార్, జి.లక్ష్మీనారాయణ, కెఎస్‌సిహెచ్.సాయిరాం, జి.రామకృష్ణంరాజు, కె.రామకృష్ణ ప్రసాద్, ఎం.శ్రీనుబాబు, డి.ఏసుబాబు, సిహెచ్.కుమార్ బాబ్జి, పి.కృష్ణకుమారి, దండు పద్మావతి, కొల్లాటి బ్రహ్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కెవి.సత్యనారాయణమూర్తి, సభ్యులుగా జిఎస్ఎస్ఆర్ స్వామి, ఎంవి.రాజేశ్వరరావు, కె.శ్రీనివాసన్, జి.అబ్రహం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ముఖ్య అతిథిగా ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి హాజరై నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీకి అభినందనలు తెలియజేశారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతి బసు వ్యవహరించారు.

రాష్ట్ర మహాసభలకు ప్రతినిధుల ఎంపిక

కాకినాడలో జనవరి 5, 6, 7, 8వ తేదీలలో నిర్వహించబోయే యుటిఎఫ్ రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి హాజరయ్యే ప్రతినిధులను జిల్లా మహాసభలో ఎన్నుకోవడం జరిగింది. రాష్ట్ర మహాసభల ప్రతినిధులుగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రంతో పాటు కె.శ్రీదేవి, జివివి.రామానుజరావు, కేత వెంకటేశ్వరరావు, ఎంవి.రాజశేఖర్, పిల్లి శ్రీనివాసరావు, బిజెవిడి.రాజ్యలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



జిల్లా గౌరవాధ్యక్షులు పట్టాభి రామయ్య, అధ్యక్షులు విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి రామభద్రం, కోశాధికారి క్రాంతికుమార్

బండిదారి పుంత గృహాలకు ఇళ్ల పట్టాలివ్వాలి

శృంగవృక్షం సర్పంచి సూరిబాబు

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం పంచాయతీ పరిధిలోని బంటుమిల్లి శివారు బండిదారి పుంతలో నివాసముంటున్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని శృంగవృక్షం సర్పంచి జంగం సూరిబాబు కోరారు. బండిదారి పోరంబోకు స్థలం, ఈ స్థలంలో నివాసం ఉంటున్న గృహాలను సోమవారం సర్పంచి సూరిబాబుతో కలిసి డిప్యూటీ తహశీల్దార్ రమ్య, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ రాజు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాఘవ మూర్తి రాజు, సర్వేయర్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి సూరిబాబు అధికారులకు బండిదారి పోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న వారి పరిస్థితులను అధికారులకు వివరించారు. అనంతరం సూరిబాబు మాట్లాడుతూ ఈ బండిదారి పుంతలో సుమారు 40 ఏళ్ల నుంచి 14 కుటుంబాలు ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నాయన్నారు. గతంలో తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని అధికారులకు విన్నవించడం జరిగిందని తెలిపారు. ఇళ్ల పట్టాల కేటాయింపు జరగలేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకొని పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని అధికారులను కోరారు.



బండిదారి పుంత స్థలాన్ని పరిశీలిస్తున్న సర్పంచి, అధికారులు

రెవెన్యూ సదస్సులో 70 ఫిర్యాదుల స్వీకరణ

శృంగవృక్షం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి జంగం సూరిబాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై రైతులు, భూ యజమానుల నుంచి సుమారు 70 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచి సూరిబాబు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు చక్కటి వేదిక అని తెలిపారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ రమ్య, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ రాజు, ఆర్ఐ రామమూర్తి రాజు, సర్వేయర్ శ్రీనివాస్, ఎంపిటిసి ఎస్.సత్యకృష్ణ, సొసైటీ మాజీ అధ్యక్షులు ఎన్.రామకృష్ణంరాజు(బ్యాంక్ బుజ్జి), విఆర్ఒలు ప్రసాద్, దేవ సహాయం, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య

నరసాపురం : పట్టణంలో నూరుశాతం పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఆదేశించారు. గడువు ముగుస్తున్న తరుణంలో చెల్లింపులు సకాలంలో లేకపోతే పురపాలక చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పట్టణంలోని అన్ని వార్డులకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, పన్ను వసూళ్లను వేగవంతం చేశామన్నారు. అందులో భాగంగా పన్ను వసూళ్ల విషయమై వార్డు, సచివాలయ సిబ్బందికి అవగాహనతో పాటు ఆస్తిపన్ను, తాగునీటి పన్ను వసూళ్ల వేగం పెంచాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నానాజీ, బిల్ కలెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

కాళ్ల : కాళ్ల, దొడ్డనపూడి గ్రామాలకు చెందిన ఇద్దరు ప్రమాద బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం మండల తాపీ మేస్త్రిల నాయకుడు బొలిశెట్టి చిన్నా, భవనం యజమాని కృష్ణ బాలాజీలు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. కాళ్ల గ్రామానికి చెందిన కొల్లి అయ్యప్ప, దొడ్డనపూడి గ్రామానికి చెందిన సన్నిధి ప్రభు, ఇటీవల తాపీపని చేస్తూ ప్రమాదవశాత్తు అరప మీది నుంచి పడిపోవటంతో గాయలపాలై భీమవరం వర్మ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఇరువురిని పరామర్శించిన మండల తాపీ మేస్త్రిల నాయకుడు బొలిశెట్టి చిన్న ఒకొక్కరికి రూ.50 వేల మొత్తం లక్ష రూపాయల సాయం అందజేశారు. భవనం యజమాని కృష్ణ బాలాజీ ఒకొక్కరికి రూ.75 వేల మొత్తం లక్ష 50 వేల రూపాయలు అందజేశారు.

విద్యార్థులకు అభినందన

తణుకు: సిల్వర్ జూబ్లీ సందర్భంగా భీమవరం బివి.రాజు కాలేజ్(అటానమస్) వారు 13వ తేదీన నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో పలు విభాగాలు వారు కొన్ని పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల యుజి, పిజి(అటానమస్) తణుకు విద్యార్థినులు 2 ప్రథమ, 6 ద్వితీయ, 2 తృతీయ బహుమతులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ తెలియజేశారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రామరాజును కలిసిన సాగునీటి సంఘ అధ్యక్షులు

నరసాపురం : ఇటీవల సాగునీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన శాంతరాజు, అందే రామకృష్ణ, పులఖండ వీరరాఘవులు, కడలి కృష్ణ మోహన్, నాయకులు సోమవారం టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజును మార్యదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఎన్నికైన అధ్యక్షులు రైతులకు మేలు చేసేలా పనులు చేపట్టాలన్నారు. పంట కాల్వల పూడిక, సాగునీటి కొరత, గుర్రపు డెక్క వంటి సమస్యల్ని తొలగించి, దాళ్వాకు నీరందించేలా కృషి చేయాలన్నారు. జక్కం శ్రీమన్నారాయణ, వాతాడి ఉమా, యర్రంశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేగంగా రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు

ఉండి: ఉండి-ఆకివీడు రహదారిలోని రైల్వే ట్రాక్ మరమ్మతు పనులను సోమవారం సంబంధిత సిబ్బంది వేగవంతం చేశారు. రైల్వే గేటు తెరవాల్సిన సమయం ఆసన్నమవడంతో పనులను మరింత వేగంగా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అనుకున్న సమయానికి పనులను పూర్తి చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ బుధవారం రాత్రి 7 గంటలకు రైల్వే గేటును తెరుస్తామని వారు తెలిపారు. రైల్వే గ్యాంగ్ మెన్‌లు, ట్రాలీ సిబ్బంది, గేట్ మెన్‌లు ఈ పనులలో నిమగ్నమయ్యారు.

విద్యార్థుల్లో నైపుణ్య పెంపునకు వర్క్‌షాప్

భీమవరం టౌన్ : డాక్టర్ బివి.రాజు ఫౌండేషన్, శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో వారం రోజులు నిర్వహించిన ఇండస్ట్రీ అకాడెమియా ప్రాక్టీసెస్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్ అను వర్క్ షాప్ సోమవారంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మంగం వేణు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వేణు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకోవడానికి, తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అంజని టెక్, సాగర్ సిమెంట్స్, వీరా కాంక్రీట్, అల్ట్రాటెక్, యూకాన్, పాసిబిల్ట్, జిందాల్ పంతర్, పద్మప్రియ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గాయత్రి అసోసియేట్స్, స్ట్రైజ్సా వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

నరసాపురం : దేశానికి పేరు తెచ్చే విధంగా నేటి యువత క్రీడల్లో రాణించాలని నరసాపురం ఆర్‌డిఒ దాసురాజు పిలుపునిచ్చారు. మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 17 టీంలతో రెండు రోజులపాటు జరగనున్న జెఎన్‌టియు సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజియేట్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ఆర్‌డిఒ ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలో అత్యధిక క్రీడాభిమానులు ఉన్న ఆట ఒక్క ఫుడ్‌బాల్ మాత్రమేనన్నారు. కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, ట్రెజరీ కెవి.స్వామి పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని వినతి

నరసాపురం : జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నరసాపురం ఎపిజెడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ సభ్యులు ఖండించారు. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులపై అనేక దాడులు జరుగుతున్నాయని, ఇటువంటి చర్యలు జరగకుండా చట్టాలను కఠినతరం చేసి జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని సోమవారం నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజుకు వినతి పత్రం అందజేశారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు పాల్గొన్నారు.

ఎస్‌సి శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలి

భీమవరం టౌన్: ఎస్‌సి శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా చుట్టూర ప్రహరీ గోడ నిర్మించి ఇవ్వాలని వెంప గ్రామ సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్ రాజుకి సిపిఎం నాయకులు సంతకాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌సి శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ నాయకులు మాట్లాడుతూ ఐదు పేటలకు సంబంధించి ఎస్‌సి శ్మశాన వాటిక ఇప్పటికే సరిపోవటం లేదన్నారు. ఎస్‌సి శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ గోడ నిర్మించి ఇవ్వాలన్నారు. ఎస్‌సి శ్మశాన పరిరక్షణ కమిటీ నాయకులు ఇంజేటి ప్రభాకర్ రావు, నేతల దేవదానం, ఇంజేటి శ్రీనివాస్, ఇంజేటి చిట్టిబాబు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన పిడిఎఫ్ ఎంఎల్‌సిలు

భీమవరం : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను పిడిఎఫ్ ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణ రావు, బొర్రా గోపీమూర్తిలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారు. లోకేష్‌కు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు పుస్తకాన్ని బహూకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నరసాపురం: పట్టణంలోని లాకుల వద్ద ఆదివారం అర్ధరాత్రి వేగంగా వస్తున్న కారు ఆటోను మధ్య భాగంలో ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. క్షతగ్రాతులు యలమంచిలి మండలం ఏనుగువాని లంక గ్రామానికి చెందిన పెదపాటి లక్ష్మికుమారి, పాలపర్తి భాస్కరరావులను నరసాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు భాగం నుజ్జునుజ్జు అయింది. అయితే కారులో ఉన్న ఎవరికీ గాయాలు కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి చెప్పారు.

ఆటో చోరీ

నరసాపురం: పట్టణంలోని 13వ వార్డులో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఆటో చోరీకి గురైనట్లు ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం దర్గా సెంటర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న షేక్ బాజీ ఈనెల 12వ తేది అర్ధరాత్రి ఇంటి ముందు ఆటోను పార్క్ చేశాడు. 13వ తేదీ ఉదయం చూసేసరికి పార్కింగ్ చేసిన ఆటో కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో గాలించగా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసుల్ని ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు

ఉండి : విజిలెన్స్ అధికారుల కమిటీ సమావేశం నిర్వహించి, మద్యం అక్రమ రవాణా, బెల్ట్ షాపుల నిర్వహణ వంటి వాటిని అరికట్టాలని యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్.గోపాలకృష్ణంరాజు ఇటీవల ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు విజిలెన్స్ అధికారులు స్పందించారు. ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం విజిలెన్స్ అధికారులు కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంబంధిత సభ్యులకు సర్కులర్ పంపించినట్లు గోపాలకృష్ణంరాజు తెలిపారు. విజిలెన్స్ అధికారులకు ఈ కమిటీలో యండగండి వినియోగదారుల సంఘం తరపున తగు సూచనలు, సలహాలు ఇచ్చి మద్యం అక్రమ రవాణా, బెల్ట్ షాపుల నిర్వహణ వంటి వాటిని అరికట్టేందుకు తమ వంతు కృషి చేస్తామని ఆయన వివరించారు.

కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పంచాయతీ పరిధిలోగల చినరామచంద్రపురం రెవెన్యూలోని రెడ్‌క్రాస్ ఆసుపత్రిలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ని ఏర్పాటు చేయాలని అఖిలభారత హ్యాండ్‌లూమ్స్ బోర్డు మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు సోమవారం గణపవరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. 1965లో ప్రజలకు వైద్యం అందించడానికి ఆసుపత్రి ఏర్పాటు చేశామని, ప్రస్తుతం ఈ ఆసుపత్రి నడవడం లేదని అన్నారు. ఆసుపత్రికి ఆనుకొని ఉన్న స్థలంలో సెల్ టవర్ ఏర్పాటు చేసి, అద్దెలు వసూళ్లు చేస్తున్నారని అన్నారు. ఈ విషయంపై జిల్లా డిఎంహెచ్‌ఒని అడగగా కన్యాకాపరమేశ్వరి వర్తకసంఘం భవనం తమ పరిధిలో లేదని తెలిపినట్లు అన్నారు. అద్దె సొమ్ములు మాకు చేరటం లేదని తెలియజేశారన్నారు. ప్రస్తుతం అక్కడ వైద్య సేవలు జరగటం లేదని డిఎంహెచ్‌ఒ తెలిపినట్లు చెప్పారు. అందువల్ల రెడ్‌క్రాస్ ఆసుపత్రిలో కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తే గణపవరం, నిడమర్రు, పెంటపాడు మండాలాలకు చెందిన 46 గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉటుందని చెప్పారు. ప్రభుత్వం ఆలోచించి గణపవరంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రామాలలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించుకునేందుకు రైతులందరూ రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్ సూచించారు. మండలంలోని నవాబుపాలెం, కొత్తూరు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి పట్టాదారి పాస్ పుస్తకాలు, అడంగల్, సరిహద్దు సమస్యలపై పలు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స నవబ్ పాలెం గ్రామ సర్పంచి మద్దుకూరి గంగాభవాని, కొత్తూరు గ్రామ సర్పంచి కూడవల్లి హనుమంతు, జనసేన మండలాధ్యక్షుడు అడపా ప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు మద్దుకూరి ధనరాజు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి

ఆచంట : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని తహశీల్దార్ జి.కనకరాజు అన్నారు. కోడేరు పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణ ద్వారా గ్రామాల్లో దీర్ఘకాలంగా అపరిసృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చక్కటి అవకాశం అని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, నేతలు కడలి నాగ మునీందర్ రావు, పిచ్చెట్టి సత్యనారాయణ, పెద్దిరాజు, డిటి రాజ్యలక్ష్మి, ఆర్ఐ జయలలిత, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు

తణుకు : క్రీడలు విద్యార్థుల్లో మంచి క్రమశిక్షణ, మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయని, ఎక్కువ మంది విద్యార్థులు ఇటువంటి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలు కావాలని మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన జాతీయ స్థాయి 62వ నేషనల్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు పాల్గొని విజేతలైనారని తెలిపారు. మోయిత్రీదాస్ ఇన్‌లైన్ హాకీలో అండర్-11 విభాగంలో బంగారు పతకం, నిత్యేష్ గౌడ్ రోలర్ హాకీలో మిక్స్‌డ్ అండర్-11 విభాగంలో కాంస్య పతకం, రోలర్ హాకీ మిక్స్‌డ్ అండర్-14 విభాగంలో జిశ్వంత్, ఎం.నాగసాయికేశవ్ కాంస్య పతకాలు సాధించారన్నారు. విజయం సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన కోచ్ ఎ.భార్గవ్, ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు.

నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

నరసాపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్ధేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 22 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ధేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సబ్ డివిజన్‌లోని అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పురపాలక సంఘ పరిధిలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పది అర్జీలు వచ్చినట్లు తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి నాలుగు, పబ్లిక్ హెల్త్ సంబంధించి మూడు, టౌన్ ప్లానింగ్ సంబంధించి మూడు మొత్తం పది అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.

ఫిర్యాదుపై విచారణ

తణుకు రూరల్ : తణుకు మండలం తేతలి గ్రామంలో ఉన్న పశు వధశాలను తొలగించాలని కోరుతూ స్థానికులు ఇటీవల స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం గోసేవ సమితి సభ్యులు, పంచాయతీ సిబ్బంది తేతలిలోని లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ పరిసరాలను పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, గో సేవా సమితి సభ్యులు కొండ్రెడ్డి శ్రీనివాసు, కోడూరి గిరీశ్వరరావు, కోట వెంకట బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

మొగల్తూరు: ఎరువులు వినియోగించని ఉత్పత్తుల వాడకంతో ఆరోగ్యం బాగుంటుందని తహశీల్దార్ కె.రాజు కిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణిలు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది సోమవారం స్టాల్‌ను ఏర్పాటు చేశారు. మండలంలోని శేరేపాలెం తదితర గ్రామాలలో పండించిన కూరగాయలు, ఆకుకూరల విక్రయానికి స్టాల్‌ను ఏర్పాటు చేశారు. పలు శాఖల అధికారులు కొనుగోలు చేశారు.ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతి శుక్రవారం డ్రైడే పాటిద్దాం, దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధులను అరికడదామని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు సూచించారు. కడకట్ల పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 28వ వార్డులో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజిన్ కార్యక్రమాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధిచెందే ప్రదేశాలను గుర్తించి, వాటిని నిర్వీర్యం చేయుట ద్వారా దోమకాటు ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధి రాకుండా కాపాడు కోవచ్చునని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ, ప్రతి శు క్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శి ఎం.చంద్రకళ, ఆశా వర్కర్ అనూరాధ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షన్ దారులను మోసగిస్తున్న పభుత్వం

వ్యకాస జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

భర్త చనిపోతే తన పెన్షన్ భార్యకు వెంటనే మంజూరు చేస్తామని చెప్పిన ప్రభుత్వం మోసం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. ఈమేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మండలంలోని ఆచంట వేమవరం గ్రామంలో వెన్నపు ప్రసాద్ అక్టోబర్ ఒకటో తేదీన పెన్షన్ తీసుకుని, ఏడవ తేదీన గుండెపోటుతో మరణించారు కానీ తన పెన్షన్‌ను భార్య జయమ్మకు మంజూరు చేయలేదన్నారు. ఇదే విషయాన్ని వేమవరం గ్రామ సచివాలయం, ఆచంట ఎంపిడిఒ కార్యాలయంకి వెళ్లిన అధికారులు నవంబర్ నెలలో చనిపోయిన వాళ్లకు మాత్రమే ఇవ్వాలని జిఒ వచ్చిందని, అక్టోబర్ నెలలో వారికి ఇవ్వటం కుదరదని తేల్చి చెప్పారని తెలిపారు. భీమవరం స్పందన కార్యక్రమానికి జయమ్మ టోకెన్ నెంబర్ 3 దరఖాస్తును స్పందనలో ఇవ్వగా ఇక్కడ కూడా నవంబర్ నెల నుంచి జిఒ వచ్చింది మీకు, 2025 ఫిబ్రవరిలో కొత్త పెన్షన్లతో ఇస్తారు వెళ్లిపోండి అని చెప్పటం కూటమి ప్రభుత్వం మాట తప్పటమేనని విమర్శించారు. ఇప్పటికైనా కలెక్టర్ వెన్నపు జయమ్మ పెన్షన్‌పై తగు చర్యలు తీసుకుని, పెన్షన్ వెంటనే మంజూరు చేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

కొత్తపల్లి సోదరులకు సత్కారం

ప్రజాశక్తి - నరసాపురం

సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని సారవ గ్రామంలో కాపు కార్పొరేషన్‌గా నియమితులైన కొత్తపల్లి సుబ్బారాయుడుకు గ్రామస్తులు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎన్నికైన మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ జానకీరామ్‌లను సారవ గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. గ్రామ సెంటర్ నుంచి సభ వరకూ బాణసంచా, తీన్మార్ డప్పులతో ఆయనకు స్వాగతం పలికారు. సర్పంచి కైలా లావణ్య, సతీష్ అధ్యక్షతన జరిగిన సభలో కొత్తపల్లి మాట్లాడారు. కాపు కార్పొరేషన్ నాకు పదవి మాత్రమే, నా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. అన్ని కులాలకు న్యాయం చేయాలన్నదే తన లక్ష్యమని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. పదవి కట్టబెట్టినందుకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీను, ముదునూరి మాత్రాజు, అడ్డాల శ్రీను, మేడిది చిట్టిబాబు, చినిమిల్లి కృష్ణ, గన్నాబత్తుల దుర్గాప్రసాద్, మేడిచర్ల అప్పారావు, గాలి నాగ శివాజీ, తోట రామలింగేశ్వర రావు, కడలి హనుమంత, కంకటాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొత్తపల్లి సోదరులను సన్మానిస్తున్న గ్రామస్థులు

విద్యాదాత మూర్తిరాజు

గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు తన సొంత సొమ్ములతో విద్యాలయాలని నిర్మించి, విద్యనందించిన విద్యాదాత చింతలపాటి సీతారామచంద్ర వర ప్రసాద్ మూర్తిరాజు ధన్యులని నారాయణపురం డిగ్రీ కాలేజీ సిపిడిసి మెంబర్ ఈపూరి సత్యనారాయణ అన్నారు. మూర్తి రాజు జయంతి సందర్భంగా స్థానిక డిగ్రీ కాలేజీలో జరిగిన జయంతి వేడుకలలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించారు. తొలుత మూర్తిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘణంగా నివాళులు అర్పించారు. నిర్మలాకుమారి మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవడం కోసం ఐదు కళాశాలల నిర్మాణం చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. నంద్యాల రామలింగరాజు మాట్లాడుతూ సొంత భూములు అమ్మి విద్యాలయాలను నిర్మాణం చేసారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మదురాజు, టి.అక్కిరాజు, కె.స్వరూపరాణి, సిహెచ్.చైతన్య, కెవి.గణేష్, జి.వెంకటరమణ, శారదా దేవి, షేక్ పర్వీన్, గిరిబాబు, బాలమణికంఠ, పిడి స్వాతి రమేష్, వెంకన్నబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకివీడు : మాజీ మంత్రి, సర్వోదయ నాయకుడు, విద్యాదాత చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు అభినవభోజుడని పలువురు వక్తలు అన్నారు. బాపిరాజు ధర్మ సంస్థ వ్యవస్థాపక నిర్వాహకుడు మూర్తి రాజు మండలంలోని దుంపగడప ప్రభుత్వ వివి గిరి డిగ్రీ కళాశాల, ఆంధ్రకేసరి ప్రకాశం శతజయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలను స్థాపించి చాలా కాలం నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ఆయన 105వ జయంతి రోజు సోమవారం ఉభయ కళాశాలల సిబ్బంది ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సుమారు 1800 ఎకరాలను విద్యాసంస్థల నిర్వహణకు అంకితం చేసిన మహా వ్యక్తి అని కొనియాడారు. మంత్రిగా, సర్వోదయ నాయకుడిగా, విద్యాభివృద్ధి కార్యకుడిగా ఇప్పటికీ జీవించే ఉన్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.బ్రహ్మం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శారద, డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ విరజానంద్ పాల్గొన్నారు.

డిపార్ట్మెంట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు

భీమవరం : ఎపిపిఎస్‌సి నిర్వహించే డిపార్ట్మెంటు పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేటులో ఎపిపిఎస్‌సి డిపార్ట్మెంటు పరీక్షల నిర్వహణపై పోలీసు, విద్యుత్, వైద్యశాఖ, ఎపిఎస్ ఆర్‌టిసి, పరీక్షా కేంద్రాల పర్యవేక్షకులు, లైజన్ అధికారులు, ఎపిపిఎస్‌సి అసిస్టెంటు సెక్రటరీ ఎస్ఎన్.షరీఫ్, ఎఎస్‌ఒ కెఎస్ఎస్.అనిల్ కుమార్‌లతో సమావేశం నిర్వహించారు. ఈనెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు. భీమవరం డిఎన్ఆర్ కళాశాల అటానమస్ కళాశాలలో ఈనెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఆరు రోజుల పాటు ఉదయం, సాయంత్రం జరగనున్నాయన్నారు. ఈనెల 20, 22 తేదీలు ఉదయం, సాయంత్రం డిఎన్ఆర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జరుగుతాయని తెలిపారు. ఈనెల 20వ తేదీ ఉదయం, సాయంత్రం, తాడేపల్లిగూడెం శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ కాలేజీ, ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం ఒక్క పూట మాత్రమే శ్రీవాసవి ఇంజనీరింగ్ కాలేజీలో డిపార్ట్మెంటు పరీక్షలు నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా సమయం కంటే గంట ముందు రావాలన్నారు.

రేపు విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం

తాడేపల్లిగూడెం : సామాన్యుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ పనిచేస్తోందని బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు పేర్కొన్నారు. సోమవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో విస్తరణలో భాగంగా తాడేపల్లిగూడెంలో 55 శాఖను ఈనెల 18న ప్రారంభిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ 1916లో విశాఖపట్నంలో ప్రారంభం అయ్యిందన్నారు. రూ.4,243 కోట్లు డిపాజిట్లు, రూ.3,386 కోట్ల రుణాలు, రూ.7,630 కోట్ల ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. లక్షా 9 వేల మంది సభ్యులతో రూ.379 కోట్ల మూలధనం కలిగి దేశంలో మొదటి 15 స్థానాలలో ఉన్నామన్నారు. గత 41 సంవత్సరాలలో 2019-20 కోవిడ్ సమయంలో మినహా మిగిలిన అన్ని ఆర్థిక సంవత్సరాలలో 10 నుంచి 42 శాతం వరకూ డివిడెండ్ సభ్యులకు అందించామన్నారు. డిపాజిట్లపై అధిక వడ్డీ అందిస్తూ, తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామన్నారు. బ్యాంక్ డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి వివిబి.లక్ష్మీ, బ్రాంచ్ మేనేజర్ కెఎమ్ఎస్ఎస్.నారాయణ పాల్గొన్నారు.

పరిశోధన, బోధన రంగాల బలోపేతానికి ఎంఒయు

తాడేపల్లిగూడెం : విశ్వవిద్యాలయ పరిధిలోని పరిశోధన, బోధన, విస్తరణ రంగాల పురోగతిని బలోపేతం చేసేందుకు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, మొండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రయివేట్ లిమిటెడ్(ముంబై) పరస్పర మాస్టర్ గ్రాంట్ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్, కోకోవా లీడ్ ఇండియా ఛైర్మన్ రూపక్ భట్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రూపక్ భట్ మాట్లాడుతూ సామాజిక అభివృద్ధిని కాంక్షిస్తూ తమ కంపెనీ అనేక సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు ఉపయోగపడేలా 18 మందికి(12 మంది బిఎస్‌సి, 4గురు ఎంఎస్‌సి నుంచి ఇద్దరు పిహెచ్‌డి) రూ.13 లక్షల మొత్తంను స్కాలర్ షిప్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు వివిధ పరిశోధనలు చేసి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని కాంక్షించారు. డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని ఒప్పందాలు జరగాలని, పరిశోధనాపరమైనటువంటి చేయూతనివ్వటానికి విశ్వవిద్యాలయం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జీవిత కాల సాఫల్యం అవార్డు పొందినటువంటి ఉపకులపతిని యూనివర్సిటీ విశ్వవిద్యాలయ అధికారులు, మొండెలిజ్ సిబ్బంది సత్కరించారు.